ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 302 | పేజీలు: 6 | వెల: రూ.3/- | మంగళవారం 10 ఫిబ్రవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# ఓటు రేటు.. భవితకు చేటు

## ప్రలోభాలతో ఎర... ప్రమాదం పొంచివుంది ముందర

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):**

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభాలతో ఆకర్షించడం, డబ్బు, మద్యం, బహుమతులు వంటి ఎరలు వేయడం ఒక సర్వసాధారణమైన దృశ్యమైపోయింది. కానీ ఈ ప్రక్రియ వెనుక దాగిన ప్రమాదాలు, భవిష్యత్తును ఎలా దెబ్బతీస్తాయో ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఓటు అనేది ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరునికి అత్యంత శక్తివంతమైన ఆయుధం. అది కొనుగోలు వస్తువుగా మారితే, అది కేవలం వ్యక్తిగత లాభానికి మాత్రమే పరిమితం కాకుండా, మొత్తం సమాజం భవిష్యత్తును చీడపురుగుల్లా కొరుక్కు తింటూ ఉంటుంది.

**ఓటుకు రేటు ఇది ఒక విషాదకరమైన వాస్తవం.**

దేశంలో ఎన్నికలు జరిగినప్పుడల్లా, ఓటు కొనుగోలు ఆరోపణలు సర్వసాధారణంగా వినిపిస్తూ ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ, నగరాల్లోనూ రాజకీయ నాయకులు ఓటర్లను డబ్బు, మద్యం, పుత్తడి, వెండి,ఇతర విలువైన వస్తువులను,బియ్యం, దుస్తులు, గృహోపకరణాలు, ఆఖరికి బిర్యానీ వంటి వాటితో రకరకాల ప్రలోభాలతో ఓటర్లను ఆకర్షిస్తున్నారు. ఉదాహరణకు, ఇటీవల రాష్ట్రంలో ముగిసిన పంచాయితీ ఎన్నికల్లో కొన్ని ప్రాంతాల్లో ఒక్కో ఓటుకు రూ.500 నుంచి రూ.55000 వరకు చెల్లించినట్లు నివేదికలు వచ్చాయి. ఓటుకు నోటు అనేది కేవలం ఆర్థిక లావాదేవీ కాదు,ఇది ప్రజాస్వామ్యానికి వేసిన ఎర. విమర్శకులు చెప్పినట్లు ఇది ఓటర్లను కొనుగోలుదారులు (కస్టమర్లు)గా మారుస్తూ, రాజకీయ నాయకులను పెట్టుబడిదారులు(విక్రేతలు)గా భావించేలా చేస్తుంది. ఇలాంటి పద్ధతులు ఎన్నికల సమగ్రతను దెబ్బతీస్తాయి. ఓటుకు రేటు అంశంపై ఎన్నికల కమిషన్ ఎంతటి కఠిన చర్యలు తీసుకున్నా, ఇవి కొన్ని సందర్భాల్లో రహస్యంగా, మరికొన్ని సందర్భాల్లో బహిరంగంగా అమ్మకం , కొనుగోలు ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ అంశాన్ని కొంత ఆలోచనాత్మక దృక్పథంతో గమనిస్తే ఓటు కొనుగోలు వెనుక




ఆర్థిక అసమానతలు ప్రధాన కారణంగా కనిపిస్తాయి. పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలు ఓటర్లను తాత్కాలిక లాభాలకు ఆకర్షిస్తాయి. కానీ ఇది ఒక విషవలయం అని ఘంటాపథంగా చెప్పవచ్చు. డబ్బు తీసుకుని ఓటు వేస్తే, ఎన్నికైన నాయకుడు అవినీతికి పాల్పడి మరిన్ని సమస్యలు సృష్టిస్తాడు ఇది ఎన్నో సందర్భాల్లో బహిరంగంగా నిరూపితమైన విషయం. దీని ఫలితంగా సమాజం మరింత పేదరికంలోకి జారుకుంటుంది. ఈ అంశాన్ని ఎవరూ బాధ్యతాయుతంగా భావించడం లేదు. ఇది కేవలం ఓటర్ల బాధ్యతా లోపం మాత్రమే కాదు; రాజకీయ వ్యవస్థ యొక్క రూపకల్పనలోనే లోపం ఉంది అని గమనించాలి. ఎన్నికల ఖర్చులు పెరిగిపోవడం వల్ల నాయకులు డబ్బు సమీకరణకు అడ్డదారులు తొక్కుతున్నారు కనుక అది తిరిగి ఓటు కొనుగోలుకు దారి తీస్తుంది.

ఓటుకు రేటుతో పొంచి ఉన్న ప్రమాదాలు అంచనా వేయడంలో ఓటర్లు విఫలం కావడంతో ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చెప్పవచ్చు. తమ

భవిష్యత్తుకు చేటు ఇలా అమ్ముకోవడం అని ఓటర్లు గుర్తిస్తే తప్ప దీన్ని అదుపు చేయడం కష్టతరం.

ఓటు అమ్మకం వల్ల తాత్కాలిక లాభం కనిపించినా, దీర్ఘకాలిక ప్రమాదాలు ఎన్నో ఉన్నాయి. ముందుగా, ఇది ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుంది. ఓటు ఆధారంగా ఎన్నికైన నాయకులు జవాబుదారీతనం లేకుండా పాలిస్తారు, ఎందుకంటే వారి విజయం డబ్బుపై ఆధారపడి ఉంటుంది, ప్రజల అవసరాలపై కాదు. ఇంకాస్త విమర్శనాత్మకంగా చెప్పాలంటే, ఇది అవినీతిని ప్రోత్సహిస్తుంది. ఎన్నికైన తర్వాత నాయకులు తమ ఖర్చులను తిరిగి సంపాదించడానికి తప్పకుండా అక్రమాలకు పాల్పడతారు, ఫలితంగా ప్రజలు మరిన్ని కష్టాలు ఎదుర్కొంటారు.

మరోవైపు, సమాజంలోని యువతపై ఇది ప్రభావం చూపుతుంది. ఓటు అమ్మకం చూసి పెరిగే పిల్లలు రాజకీయాలను అవినీతికి కేంద్రంగా భావిస్తారు, ఫలితంగా భవిష్యత్తు నాయకత్వం బలహీనమవుతుంది. ఆలోచనాత్మక దృక్పథంతో గమనిస్తే ఇది సమాజ సమానత్వాన్ని దెబ్బతీస్తుంది. ధనవంతులు మాత్రమే ఓట్లు కొనగలిగితే, పేదల గొంతు అణగారిపోతుంది. ఇది ఒక ప్రమాదకరమైన ధోరణి. రాజకీయాలు ధనికుల ఆటస్థలంగా మారితే, సామాన్యుడి హక్కులు హరించబడతాయి. బాధ్యతావంతమైన ఓటింగ్ వైపు ఓటర్లు పయనించి

ఈ సమస్యను అధిగమించడానికి ఎన్నికల కమిషన్ కూడా మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాలి. డిజిటల్ మానిటరింగ్, ఓటర్ ఎడ్యుకేషన్ క్యాంపెయిన్లు, ఎన్నికల ఖర్చు పరిమితులు వంటివి అమలు చేయాలి. కానీ విమర్శకులు చెప్పినట్లు, ఇది కేవలం చట్టాల సమస్య కాదు. ఓటర్లు తమ ఓటును తాత్కాలిక లాభాలకు అమ్మకుండా, దీర్ఘకాలిక సమాజ శ్రేయస్సు కోసం ఆలోచించాలి. రాజకీయ పార్టీలు కూడా నిజమైన అభివృద్ధి ఎజెండాలతో ముందుకు రావాలి, ప్రలోభాలతో కాదు. ప్రజాస్వామ్యం అనేది ఒక హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా. ఓటు అమ్మకం వల్ల భవిష్యత్తు తరాలకు చేటు చేకూరుతుంది. ముందు పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి, బాధ్యతావంతమైన ఓటర్లుగా మారాలి. ఇది మార్పు మొదలుపెట్టడానికి సరైన సమయం ఓ ఓటరు మహాశయులారా, రాజకీయ నేతలారా ఓటుకు రేటు కాదు ఓటుకు విలువ ఇవ్వండి. అది మన విలువనే కాదు, మన భరత జాతి విలువను ప్రపంచవ్యాప్తంగా సగర్వంగా పెంచుతుంది.



## ముగిసిన మున్సిపల్ ఎన్నికల

# ప్రచారపర్వం

### రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు 11వ తేదీన పోలింగ్

### ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 వరకు పోలింగ్.. ఈ నెల 13న ఓట్ల లెక్కింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వంలో అన్ని పార్టీల నేతలు చెమటోర్చారు. చివరి రోజుల ఆయా ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, విపక్ష నేతలు సుడిగాలి పర్యటనలు చేపట్టి ప్రచారంలో పైచేయి సాధించాలని చూశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ప్రజాప్రతినిధులు సైతం ప్రచారంలో బిజీగా గడిపారు. సోమవారం సాయంత్రం ప్రచారం ముగియనుండడంతో ప్రరచారాన్ని ఉరుకులు పెట్టించారు. ఆయాచోట్ల కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ నేతలు తమ నియోజకవర్గాల పరిధిలోని మున్సపల్ కేంద్రాల్లో ప్రతిష్ఠాత్మక ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అభ్యర్థులు పట్టణ ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు తమదైన శైలిలో ప్రచారం చేపట్టారు. మరోవైపు అమలుకాని కాంగ్రెస్ హావిలను ఎండగడుతూ బిఆర్ఎస్ నేతలు ముందుకు సాగారు. అన్ని పార్టీల వాళ్లు ర్యాలీలతో హోరెత్తించారు.. గడపగడపకూ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ముఖ్యంగా మహిళలకు బొట్టుపెట్టి తమ పార్టీ విధానాలను వివరిస్తూ ..మిగతా 2లో




## ముున్సిపల్ ఎన్నికల వేళ

# మద్యం దుకాణాలు బంద్

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

మద్యం ప్రియులకు మున్సిపల్ ఎన్నికలు షాక్ ఇచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ కీలక ప్రకటన చేసింది. రెండు రోజుల వైన్స్ బంద్ కానున్నాయి. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు సమయం ఆసన్నమవుతోంది. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. 13 ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఆయా మున్సిపాలిటీల పరిధిలోని మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. ఈనెల 9వ తేదీ నుంచి సాయంత్రం 5 గంటల నుంచి 11 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని ఎన్నికల, ఆబ్కారీ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా 13వ తేదీ వరకు ఫలితాల నేపథ్యంలో వైన్స్, బార్లు మూసివేయనున్నారు. మరోవైపు.. సోమవారంతో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. సాయంత్రానికి మైకులు మూగబోయాయి. గతానికి భిన్నంగా ఈసారి జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు అధికార, ప్రతిపక్షాల మధ్య యుద్ధ వాతావరణాన్ని తలపించాయి. వ్యూహాలు, ప్రతి వ్యూహాలతో రంగంలోకి దిగిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఒకరిపై మరొకరు పై చేయి సాధించాలన్న పట్టులతో ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలతో పాటు ఆయా పార్టీల నుంచి రెబల్స్ గా పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ప్రచారంలో మునిగి తేలారు. ర్యాలీలు, డప్పు చప్పుళ్లు, డీజే పాటల మోతలతో ప్రచారాన్ని హోరెత్తించారు. చివరి రోజు సుడిగాలి పర్యటనలకు నేతలు సిద్ధం అయ్యారు.

## రెడ్లు అయినా, రావులు అయినా మా దగ్గరకు రావాల్సిందే: ఒవైసీ

### మున్సిపల్ ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపుతామని వ్యాఖ్య

2లో..

### ముఖ్యమంత్రులే తమ దగ్గరకు రావాలన్న ఒవైసీ

# బీజేపీకి లైఫ్ లైన్ అసదుద్దీన్ ఒవైసీయే..

### ఆయనే వారికి దేవుడు: రేవంత్ రెడ్డి

### తెల్లారితే బీజేపీ అసదుద్దీన్‌ను తలుచుకుంటుందని వ్యాఖ్య

### రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో చేసిందన్న ముఖ్యమంత్రి

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

బీజేపీకి లైఫ్‌లైన్ అసదుద్దీన్ ఒవైసీయేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ఈరోజు తెరపడుతోంది. ఈ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, బీజేపీ నాయకులు అసదుద్దీన్ ఒవైసీ పేరును ఎన్నిసార్లు తలుచుకుంటారోనని ఎద్దేవా చేశారు. మజ్లిస్ పార్టీని చూపించి ఇంకా ..మిగతా 2లో






అంతర్జాతీయ వ్యవసాయ రంగ నిపుణులు ప్రొఫెసర్ ప్రభు ఎల్ పింగలి కి గౌరవ డాక్టరేట్ ను బహుకరిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

## ఘనంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

# మెగా స్నాతకోత్సవం

### అంతర్జాతీయ వ్యవసాయ నిపుణులు ప్రభు పింగళి కి గౌరవ డాక్టరేట్

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పెండింగ్ లో ఉన్న 56, 57, 58 వార్షిక స్నాతకోత్సవాలను సోమవారం సం యుక్తంగా రాజేంద్రనగర్ లోని వర్శిటీ క్రీడా మైదానంలో నిర్వహించారు. ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అధ్యక్షతన మెగా స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ స్నాత కోత్సవంలో 2,135 మంది అండర్ గ్రాడ్యుయేట్స్ కి, 480 మంది పోస్టు గ్రాడ్యుయేట్స్ కి, 129 మ శీదికి పీహెచ్ డీ పట్టాలు అందజేశారు. ఆరుగురు పీహెచ్డీ అభ్యర్థులకు, 26 మంది పోస్టు గ్యాడ్యుయేట్స్ కు 64 మంది అండర్ గ్రాడ్యుయేట్స్ కు బంగారు పతకాలను అందజేశారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవం ప్రసంగం చేసిన అంతర్జాతీయ వ్యవసాయ రంగ నిపుణులు డాక్టర్ ప్రభు పింగళి కి గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేశారు. తొలుత ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తన స్నాతకోత్సవ నివేధిక ను సమర్పిం చారు. బోధన, పరిశోధన, విస్తరణ ..మిగతా 2లో



## రెండేళ్ల తరవాత మళ్లీ

# అధికారం మాదే

### హామీల అమలుకు నిలదీస్తూనే ఉంటాం

### భూపాలపల్లి ప్రచారంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్


**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.రెండేళ్ల తర్వాత ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమని హెచ్చరించారు. మా కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు భూపాలపల్లిలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ ..మిగతా 2లో

# ఘనంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మెగా స్నాతకోత్సవం

మొదటి పేజీ తరువాయి...

అంశాలలో విశ్వవిద్యాలయం అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తుందని తెలిపారు. తొలిసారిగా వ్యవసాయ కూలీల పిల్లలకు యూజీ కోర్సులలో 15శాతం సీట్లు ప్రత్యేకంగా కేటాయించామన్నారు. ప్రత్యేక కోటా సీట్ల ఫీజు ను రూ. 10లక్షల నుంచి రూ. 5 లక్షలకు తగ్గించడం జరిగిందన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా 1200 గ్రామాలలోకి వెళ్లి లక్ష ఇరవై వేల మంది రైతులను నేరుగా కలిశామని జానయ్య వివరించారు. నూతనంగా కొడంగల్, నిజమాబాద్, హుజూర్నగర్ లలో వ్యవసాయ కళాశాలలను ప్రారంభించామన్నారు. వెస్టర్న్ సిడ్నీ యూనివర్శిటీ సహ అనేక అంతర్జాతీయ సం స్థలతో కలసి పనిచేస్తున్నామన్నారు. ఈ అన్ని చర్యల వల్ల విశ్వవిద్యాలయం ర్యాంకు 37 నుంచి 27కు చేరుకుందన్నారు. ఐసీఏఆర్, రాష్ట్ర ప్రభుత్వాల నిరంతర సహకారంతో విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థానానికి తీసుకొని వెళ్లడానికి కృషి చేస్తామని తెలిపారు. తన చిరకాల మిత్రుడు, అత్యంత ప్రతిభాశాలి జానయ్య నేతృత్వంలో



స్నాతకోత్సవ ఉపన్యాసం చేస్తున్న ప్రొఫెసర్ ప్రభు ఎల్ పింగళి

విశ్వవిద్యాలయం మంచి ప్రగతి సాధిస్తుందని ముఖ్య అతిథి డాక్టర్ ప్రభు ఎల్ పింగళి అభినందించారు. 1960లలో అహార కొరత ఎదుర్కొన్న భారతదేశం హరిత విప్లవం వల్ల నేడు అహార ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని ఆయన వివరించారు. పప్పు ధాన్యాలు, తృణధాన్యాల ఉత్పత్తులలో వెనుకబడి ఉన్నామన్నారు. దాని కారణంగా అధిక సంఖ్యాంక ప్రజలలో పౌష్టికాహార లోపం ఉందన్నారు. ప్రపంచీకరణ నేపద్యంలో ప్రజల అహార అలవాట్లలో అనేక మార్పులు వచ్చాయని, ప్రాశ్చాత్యుల అహారపు అలవాట్లు మన వారికి అలవడుతున్నాయని ప్రభు పింగళి అన్నారు. కోవిడ్ తర్వాత డిజిటలరీకరణ కారణంగా వివిధ యాప్ ల ద్వారా ఇంటి వద్దకే ఆహార పదార్థాలు అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సాగు పద్ధతులు, పంటల సరళి, విధానాలు మార్చాల్సిన అవసరం ఉందని డాక్టర్ ప్రభు పింగళి పేర్కొన్నారు. అదునాతన టెక్నాలజీలు, డిజిటల్ విధానాలను విస్తరణ సేవలను సన్నకారు రైతాంగానికి అందుబాటులోకి తీసుకుని రావాలన్నారు. పంటల వైవిధ్యకరణ కు తోడ్పడే విదంగా వ్యవసాయ విధానాలు రూ పొందించాలని సూచించారు. రవాణ, మార్కెటింగ్ వ్యవస్థ నిలువ సదుపాయాలలో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు అధికం కావాలన్నారు. వినియోగదారులు ఆహారపు అలవాట్లకు అనుగుణం గాను, ప్రజలకు పౌష్టికాహార భద్రత అందించే విదంగాను ప్రణాళికలు ఉండాలని పింగళి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్, కమిషనర్ డాక్టర్ గోపి, పాలకమండలి సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## మగిసిన మున్సిపల్ ఎన్నికల

# ప్రచారపర్వం

మొదటి పేజీ తరువాయి...

ఓట్లు అడగడం విశేషం. బిఆర్ఎస్ అగ్రనేతలైన కేటీఆర్, హరీశ్‌రావు ప్రచారపర్వాన్ని తమ భుజాన వేసుకున్నారు. కారుకు ఓటేసి వెసపూరిత కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని పిలుపునిస్తూ ముందుకుసాగారు. సిఎం రేవంత్ సహా మంత్రులు పలు చోట్ల ప్రచారంలో కనిపించారు. బిజెపిలో ఇద్దరు కేంద్రమంత్రులు బండి సంజరు, కిష్ రెడ్డి, అధ్యక్షుడు రాంచంద్రరావు సహా ఎంపిలు, ఎమ్మెల్యేలు ప్రచారం చేపట్టారు. గతంలో ఎప్పుడూ లేనంతగా బిజెపి కూడా ప్రచారంలో దూకుడు ప్రదర్శించింది. బల్దియాల్లో జరిగిన ప్రచార సభల్లో పాల్గొన్నారు. కార్నర్ విటింగ్‌లు నిర్వహించి ఓటర్లతో మమేకమయ్యారు. మహిళలు, యువతతో ముచ్చటించి సమస్యలసు తెలుసుకున్నారు. ప్రచార ర్యాలీల్లో పాల్గొని క్యాడర్‌లో జోష్ నింపారు. అన్ని పార్టీలు మున్సిపాలిటీల వారీగా ఇచ్‌చార్జిలను నియమించి పక్కా ప్రణాళికతో క్యాం పెయిన్‌ను హోరెత్తించారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సభలకు జనం నుంచి మంచి స్పందన కనిపించింది. ఇప్పటికే అన్ని ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ సహా బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతలు తమ అభ్యర్థుల తరఫున జోరుగా ప్రచారం చేపట్టారు. సోమవారం పలు జిల్లాల్లోని బల్దియాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి పలు జిల్లాల్లోని మున్సిపాలిటీలను చుట్టేశారు. అలాగే మెజార్టీ మంత్రులు తమ నియోజకవర్గాల పరిధిలోని బల్దియాల్లోనే మకాంవేసి ఓట్లు అభ్యర్థించారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సైతం పలు మున్సిపాలిటీల్లో ప్రచారం సాగించారు. మున్సిపల్ ప్రచారపర్వంలో బీజేపీ కూడా ముందంజలో ఉంది.ఆ పార్టీ అభ్యర్థుల తరఫున కేంద్ర మంత్రులు బండి సంజరు, కిషన్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం చేశారు. ఆ పార్టీ ఎంపీలు అర్వింద్, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ తమ నియోజకవర్గాల పరిధిలోని మున్సిపాలిటీలను చుట్టేశారు. సంకల్ప యాత్రల పేరిట ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పార్టీ మహామహులు ప్రచారం సాగించారు.

# బీజేపీకి లైఫ్ లైన్ అసదుద్దీన్ ఒవైసీయే..

మొదటి పేజీ తరువాయి...



ఎంతకాలం ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. బీజేపీ తెల్లారితే అసదుద్దీన్‌నే తలుచుకుంటారని, ఆయనే వారికి దేవుడు అన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై తీవ్రంగా మండిపడ్డారు. మోదీని చూసి ఓటు వేయాలని బీజేపీ నాయకులు చెబుతున్నారని, గల్లీ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలు వచ్చాయని ఇప్పుడు బీజేపీ నేతలు వచ్చి కేంద్రం నుంచి నిధులు తీసుకు వస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన నిధులు సహజంగానే వస్తాయని, వీరు తేవడమేమిటని అన్నారు. ప్రత్యేకంగా వారు ఏమైనా నిధులు తెస్తే చెప్పుకోవాలని అన్నారు. తెలంగాణ కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 42 పైసలు వస్తున్నాయని, అదే బీహార్ రూపాయి చెల్లిస్తే ఆరు రూపాయలు వెళుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. దక్షిణాదిను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఉత్తరాది రాష్ట్రాలకు అధిక నిధులు ఇస్తున్నారని, ఈ వివక్షపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. భారీ ప్రాజెక్టులు అన్నీ ఉత్తరాదికే వెళుతున్నాయని ఆరోపించారు. కేంద్రం కొత్తగా ఇచ్చిన ప్రాజెక్టులు ఏవీ లేవన్నారు. పన్నెండేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలో ఉన్నారని, 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ తెలంగాణను పాలించిందని, కానీ వారు చేసిందేమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తే మోరీని తీయడానికి మోదీ వస్తారా? బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే కేసీఆర్ వస్తారా? అని ప్రశ్నించారు. తాము రెండేళ్లలోనే ఎన్నో పనులు చేశామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తున్నామని, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించామని, పదేళ్లు ఇవ్వని రేషన్ కార్డులను ఇచ్చామని, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని ముఖ్యమంత్రి అన్నారు. మరోమారు కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని, కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తుకే ఓటు వేయాలని కోరారు. తమకు ఓటు వేస్తే అభివృద్ధి పూచీ మాదే అన్నారు.




# ఓటు కోసం నేతల పాట్లు

### ఎక్కడెక్కడో ఉన్న వారి కోసం ఆరా

### వచ్చేవారికి ఆఫర్లతో రప్పించే యత్నం

**నిజామాబాద్,ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

మున్సిపాలిటీ ఎన్నికలకు ఒక్కరోజే సమయం ఉండడంతో ఓట్లు వేసే వారి గురించి అభ్యర్థులు ఆరా తీస్తున్నారు. ఉపాధి, ఉద్యోగాల కోసం వెళ్లిన వారిని రప్పించేందుకు రంగంలోకి దిగారు. బరిలో ఉన్న అభ్యర్థులు తమ వార్డులోని ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారు.. ఎవరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని ఆరా తీస్తూ వారిని ప్రసన్నం చేసుకునేందుకు పరుగులు పెడుతున్నారు.మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు ఒక్క రోజే ఉండడంతో గెలుపే లక్ష్యంగా ఓటర్లను తమ వైపు తిప్పుకునేలా పలువురు అభ్యర్థులు హామీలతో పాటు ఆఫర్లు ఇస్తున్నారు. గంపగుత్త ఓట్లను రాబట్టేందుకు కులసంఘాలకు భారీగా తాయిలాలతో గాలం వేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పట్టణాల్లో ఓటర్లు వివిధ పనులో బీజిగా ఉంటుండడంతో అభ్యర్థులు తెల్లవారగానే ఓటర్ల ఇళ్లకు అభ్యర్థులు తమ అనుచరగణంతో కాలనీల్లోని పలువురి ఇళ్లకు వెళ్లి ఓట్లు అడుగుతున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో ఆయా వార్డుల్లో ప్రధాన వీధుల్లో పర్యటిస్తూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ అభ్యర్థుల గుర్తులతో కూడిన కరపత్రాలను ఓటర్లకు అందిస్తూ తమకే ఓటు వేయాలని ప్రాధేయపడుతున్నారు. ఈనెల 11వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్ దేవుళ్ళు ఓటు వేసి ఎవరిని గెలిపిస్తారో వేచి చూడాల్సిందే. మున్సిపల్ ఎన్నికల్లో ఒక్కో ఓటు కీలకం కానుంది. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అభ్యర్థులు ఒక్కో ఓటు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అభ్యర్థులు మున్సిపల్ ఎన్నికల్లో ప్రతీ ఓటు తమకే పడేలా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఓటరు జాబితాలో నమోదైన ఓటర్ల ఇంటింటికి అభ్యర్థులు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఉద్యోగాలు, ఉపాధి రీత్యా ఇతర పట్టణాలకు ప్రాంతాలకు వలస వెళ్లిన పట్టణ ఓటర్లను రప్పించేందుకు అభ్యర్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటరు జాబితాలో నమోదై స్థానికంగా ఉండని వారిని తమవైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. తమ మద్దతుదారులు ఎవరెవరు ఎక్కడ ఉన్నారనే వివరాలను సేకరించి వారితో రోజుకు ఒకసారైన మాట్లాడుతూ తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. ఎక్కువ మంది ఓటర్లు ఉంటే వారి వద్దకు తమ సన్నిహితులను పంపిస్తున్నారు. ఎన్నికల్లో తమకు ఓటు వేసే విధంగా వ్యక్తి గతంగా ముఖముఖీగా మాట్లాడిస్తున్నారు. ముగ్గురు, నలుగురు, అంతకంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే ప్రత్యేక వాహనాలు సమకుర్చేందుకు సిద్ధవుతున్నారు. ఒకరిద్దరు ఓటర్లు ఉన్నా వారు కోరితే వాహన సదుపాయం కల్పిస్తామని, లేదంటే రాకపోకలకు రవాణా ఖర్చులతో పాటు ఇతర ఖర్చులు ముందుగానే అందిస్తామని చెబుతున్నారు. ఆలస్యం చేస్తే తమ పోటీదారులు వలస ఓటర్ల నుంచి ఎక్కడ మాట తీసుకుంటారోనని అప్రమత్తమవుతున్నారు. దీంతో ఎవరికివారు ముందుగానే వలస ఓటర్లను సంప్రదించి మాట తీసుకుంటున్నారు. వాహన సదుపాయం కల్పించిన రవాణా ఖర్చులు అందజేసిన వలస ఓటర్లతో రోజు మాట్లాడే బాధ్యత తమకు సన్నిహితంగా ఉండే వారికి అభ్యర్థులు అప్పగించారు.

## తిరుమల లడ్డూ కౌంటర్లలో

# ఆన్‌లైన్ పేమెంట్

### క్యూఆర్ కోడ్‌తో విక్రయానికి యోచన

**తిరుమల,ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**



శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు సులభంగా లడ్డూలు పొందేలా టీటీడీ ఆలోచనలు చేస్తోంది. లడ్డూ విక్రయ కేంద్రంలోని ప్రతి కౌంటర్ వద్ద యూపీఐ పేమెంట్‌కు అవకాశం కల్పించనుంది. దీంతో చిల్లర కోసం వెతుక్కునే పనిలేకుండా పోనుంది. అలాగే ఆన్‌లౌన్ పేమెంట్‌తో నగదు లెక్కింపు సమసయా తీరనుందని అంటున్నారు. ఏటా లడ్డూల విక్రయాలు భారీగా పెరుగుతున్నాయి. కౌంటర్ వద్ద భక్తులు నగదు చెల్లించి లడ్డూలు పొందుతున్నారు. శ్రీవారి ఆల యం వెనుకభాగంలోని లడ్డూ విక్రయ కేంద్రంలో గతేడాది కియోస్క్ యంత్రాలను టీటీడీ అందుబాటులోకి తెచ్చింది. ఇటీవల యూపీఐ పేమెంట్లు చేసే వారి సంఖ్య పెరిగిన క్రమంలో ఈ నూతన యంత్రాలను అందుబాటులో ఉంచింది. కావాల్సిన లడ్డూల సంఖ్య ఎంపిక చేసి యూపీఐ ద్వారా పేమెంట్ చేస్తే వచ్చే రశీదు ఆధారంగా కౌంటర్‌లో లడ్డూలు పొందవచ్చు. అయితే, ఈ యంత్రాల వద్ద ఇటీవల రద్దీ అధికం కావడం, యంత్రాల్లో సాంకేతిక ఇబ్బందులు, మళ్లీ లడ్డూల కోసం కౌంటర్ క్యూలైన్లలో నిలబడడం తదితర కారణాల నేపథ్యంలో కౌంటర్ల వద్దే పేమెంట్ క్యూఆర్ కోడ్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. తద్వారా అదనంగా కియోస్క్ యంత్రాల ముందు నిలబడే అవసరం ఉండదని, నేరుగా కౌంటర్‌లోనే లడ్డూలు పొందవచ్చని అభిప్రాయపడుతున్నారు. ఈ సర్వీసును ఇచ్చేందుకు ఓ బ్యాంక్ కూడా ముందుకు వచ్చినట్టు సమాచారం. తొలుత ప్రయోగాత్మకంగా కొన్ని కౌంటర్లలో ఈ విధానాన్ని అమలుచేసి వచ్చే ఫలితాలను బట్టి అన్ని కౌంటర్ల వద్ద ఏర్పాటు చేయాలని టీటీడీ అధికారులు ఆలోచిస్తున్నారు.

# రెడ్లు అయినా, రావులు అయినా మా దగ్గరకు రావాల్సిందే: ఒవైసీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

రెడ్లు అయినా, రావులు అయినా తమ దగ్గరకు రావాల్సిందేనని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రుల దగ్గరకు తాము వెళ్లమని, వాళ్లే తమ దగ్గరకు రావాలని అన్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎంఐఎం మద్దతు లేకుండానే కాంగ్రెస్ గెలిచిందా? అని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం సత్తా ఏమిటో చూపుతామని అన్నారు. మరోవైపు అసోం సీఎం హిమంత బిశ్వపై హైదరాబాద్ పోలీసులకు ఒవైసీ ఫిర్యాదు చేశారు. ముస్లింలను కాల్చుతున్నట్టుగా ఉన్న వీడియోను పోస్టు చేసినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని ఒవైసీ అన్నారు. ముస్లింలను రెచ్చగొట్టేందుకు దురుద్దేశపూర్వకంగా ఈ వీడియోను హిమంత పోస్టు చేశారని మండిపడ్డారు. జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించేలా ఆయన తీరు ఉందని విమర్శించారు.

# రెండేళ్ల తరవాత మళ్లీ అధికారం మాదే

మొదటి పేజీ తరువాయి...


మాట్లాడుతూ.. హామీలు అమలు చేయాలని బరాబర్ అడుగుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ వెంటపడుతూనే ఉంటామని తెలిపారు. అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల్లో గెలిస్తే కల్యాణలక్ష్మి డబ్బులతో పాటు తులం బంగారం ఇస్తానని అబద్దాలు చెప్పిండని అన్నారు. కానీ ఇప్పుడు మొఖం బాగోలేక అద్దం పగులగొట్టినట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఉన్నప్పుడు డిసెంబర్‌లోనే రైతుబంధు పడేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చినా రైతుబంధు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ తెలిపారు. నువ్వు పెట్టినవా తీసేయడానికి.. రెండేళ్లలో ఈ పొట్టోడు ఏం పీకిండని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే నీ వీపు చింతపండు చేస్తారని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాను తెచ్చింది అభివృద్ధి చేసింది కేసీఆర్ అని తెలిపారు. సింగరేణి కాంట్రాక్టులను రేవంత్ రెడ్డి తన బామ్మర్దికి కట్టబెట్టిండని పేర్కొన్నారు. బొగ్గు కుంభకోణం బయటపెట్టామని ఫేక్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఓటుకు నోటు కేసులో ఆధారాలు ఉండకూడదని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో నిప్పు పెట్టి తగులబెట్టారని మండిపడ్డారు. తెలంగాణను ఆగం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని గల్లా పట్టుకుని అడగండని ఓటర్లకు పిలుపునిచ్చారు. తులం బంగారం ఎప్పుడిస్తావని అడగాలన్నారు. రేవంత్ రెడ్డికి ఓటుతోనే కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. బూతుల ముఖ్యమంత్రికి పోలింగ్ బూత్‌లోనే బుద్ధి చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అన్ని వార్డుల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఇదిలావుంటే అసలు కాంగ్రెస్ వాళ్లు మసకబడితే నకిలీ తెలుగుదేశపోడు ముఖ్యమంత్రి అయ్యిండని రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లిలో కేటీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో అసలైన కార్యకర్తలు, నాయకులకు విలువ లేదన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ వాళ్ల మీద పెత్తనం చేసుకో అంతే కానీ కేసీఆర్‌ను ఒక్క మాటంటే బిడ్డా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమన్నారు.



# వ్యవసాయ విద్యలో బంగారు పతకాలను సాదించిన విద్యార్థులు



ఏడు గోల్డ్ మెడల్స్ సాధించిన స్నేహలత ను అభినందిస్తున్న వ్యవసాయ రంగ నిపుణులు ప్రొఫెసర్ ప్రభు ఎల్ పింగళి, ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య


ఆరు గోల్డ్ మెడల్స్ సాధించిన గన్నేరపు నవ్య


ఐదు గోల్డ్ మెడల్స్ సాధించిన మారం సంజన


వ్యవసాయ పాలిటెక్నిక్ నుంచి పీ హెచ్ డీ పూర్తి చేసిన మొదటి విద్యార్థి జి వినయ్

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన 56, 57, 58వ వార్షిక స్నాతకోత్సవంలో 90మంది విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు. రాజేంద్రనగర్ లోని వర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన స్నాతకోత్సవంలో అంతర్జాతీయ వ్యవసాయ రంగ నిపుణులు ప్రొఫెసర్ ప్రభు ఎల్ పింగళి, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య చేతుల మీదుగా బంగారు పతకాలను అందుకున్నారు. 56వ వార్షిక స్నాతకోత్సవంలో బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన గన్నేరపు నవ్య ఆరు గోల్డ్ మెడల్ సాధంచగా, బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన స్నేహలత ఏడు గోల్డ్ మెడల్స్ సాదించారు. బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసిన ఎం సంజన ఐదు గోల్డ్ మెడల్స్ సాదించి అందరి మన్ననలను చురగొన్నారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ చదువుతు, బీఎస్సీ అగ్రికల్చర్ లో సీటు సంపాదించి ఆ తర్వాత అగ్రానమి లో ఎంఎస్సీ, పీ హెచ్ డీ పూర్తి చేసి డిగ్రీ పొందిన వారిలో మొటమొదటి విద్యార్థి గడిపే వినయ్ కావడం గమనార్హం. బంగారు పతకాలను సాదించిన వారి మాటలలోనే....

**మాడ్రన్ అగ్రికల్చర్ పై దృష్టి పెడతా : 7 బంగారు పతకాలు సాదించిన స్నేహలత :**

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన స్నేహలత మాడ్రన్ అగ్రికల్చర్ పై దృష్టిపెడతానని తెలిపారు. నారాయణపేట్ జిల్లా కొత్తపల్లి మండలం, నిడ్జిత గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన పర్వతరెడ్డి, ఇందిర ల కుమార్తె అయిన స్నేహలత ప్రస్తుతం ఐఐటీ ముంబాయి లో ఎంటెక్ జీయో ఇన్ఫర్మేటిక్స్ చదువుతున్నారు. మంచి ప్యాకేజీతో ఉద్యోగం సాదించి మాడ్రన్ వ్యవసాయంపై దృష్టి సారించి రైతాంగానికి సేవ చేయాలనే ఆలోచన తో ఉన్నానన్నారు.

**ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపేర్ అవుతున్నా: గన్నేరపు నవ్య**

బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన హనుమకొండ జిల్లా నడికూడ మండలం, రాయపర్తి గ్రామానికి చెందిన గన్నేరపు నవ్య ఆరు గోల్డ్ మెడల్స్ సాదించారు. తండ్రి శ్రీనివాస్ పెట్రోల్ బంకు లో పనిచేస్తుండగా, తల్లి రజిత ఆశా వర్కర్ గా పనిచేస్తుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆమె ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపేర్ అవుతున్నానని తెలిపింది

**పోటీ పరీక్షలు రాస్తున్నా: మారం సంజన**


బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసిన వరంగల్ జిల్లా కాజీపేట్ ప్రాంతానికి చెందిన మారం సంజన పోటీ పరీక్షలకు సిద్ధం అవుతుంది. జీవితంలో స్థిరపడ్డాక ఉన్నత చదువులు చదవవచ్చని ఆమె అభిప్రాయం వ్యక్తం చేసింది. తండ్రి లక్ష్మణ్ యాదవ్ వ్యాపారం చేస్తుండగా, తల్లి పద్మావతి గృ హిణీ గా ఉన్నారు. ఉద్యోగం వేటలో ఉన్నానన్నారు.

**ఉద్యోగానికి రాజీనామ చేసి పీహెచ్ డీ పూర్తి చేసిన విద్యార్థి జి వినయ్ :**

జగిత్యాల పాలిటెక్నిక్ లో 2009-11లో వ్యవసాయ పాలిటెక్నిక్ చదివిన కరీంనగర్ జిల్లా బీమదేవరంపల్లి మండలం, కొప్పురు కు చెందిన గడిపె వినయ్ ఆ తర్వాత బీఎస్సీ అగ్రికల్చర్ లో సీటు సంపాదించిన మొదటి బ్యాచ్ పాలిటెక్నిక్ విద్యార్థి. 2011 నుంచి 2015 వరకు అశ్వారావుపేట్ వ్యవసాయ కళాశాల లో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశారు. 2015-17 వరకు జగిత్యాల్ లో అగ్రానమి లో పీజీ పూర్తి చేసిన వినయ్ 2017 ఏఈఓ గా ఉద్యోగం సంపాదిం చాడు. 2018 నవంబరు వరకు ఏఈఓ గా ఉద్యోగం చేసిన వినయ్ ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామ చేసి 2018లో పీహెచ్ఎ లో చేరారు. పీహెచ్ఎ పూర్తి చేసిన ఆయన అసిస్టెంట్ ప్రొఫెసర్ కావలన్నదే తన కోరిక అన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థి నుంచి బీఎస్సీ అగ్రికల్చర్ చదివి నేడు పీహెచ్ఎ పూర్తి చేయడం వెనుక వ్యవసాయ పనులు చేసుకునే తండ్రి మొగిలి, తల్లి రేణుక ల ప్రోత్సాహం ఉందన్నారు. నెట్ క్వాలిఫై అయ్యానని, మూడు బుక్స్ రాశానని, 18 రీసెర్చ్ ఆర్టికల్స్ పబ్లిష్ అయ్యాయన్నారు. వీరితో పాటు వ్యవసాయ విధ్యలో రాణించి రైతులకు సేవ చేయాలని, ఎక్కువ జింక్, ఐరన్ కలిగిన వరి వంగడాలను కనుగొనాలని టి ఆర్తీ, అకాల వర్షాలను తట్టుకునే విదమైన వరి ఉత్పత్తులను తీసుకురావాలని మామిడి అక్షయ్, రైతులకు మరింత సేవ చేయాలని నిహారిక ఇలా బంగారు పతకాలను సాదించిన విద్యార్థులు తమ మనస్సులోని మాటలను తెలియజేశారు.

# హనుమాన్ నగర్‌లో చర్చి కూల్చివేత

## ప్రార్థనలు చేసుకునేందుకు నిర్మించుకున్న ఆరాధన స్థలాన్ని కూల్చివేయడం బావ్యం కాదు : చర్చి సభ్యులు



హనుమాన్ నగర్ లో నిర్మాణంలో ఉన్న చర్చి ని కూల్చివేసిన రెవెన్యూ సిబ్బంది

**బుద్వేల్, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ హనుమాన్ నగర్ లో నిర్మాణంలో ఉన్న ఓ చర్చిని రాజేంద్రనగర్ తహసీల్దార్ బి రాములు పర్యవేక్షణలో సిబ్బంది సోమవారం కూల్చివేశారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.. హనుమాన్ నగర్ ప్రాంతంలో గల ప్రభుత్వ స్థలంలో కొందరు స్మర్ణ ప్రార్ధన మందిరం పేరుతో చర్చి నిర్మిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు శనివారం నుంచి అక్కడ చర్చి నిర్మించవద్దని స్థానికులకు చెప్పారు . దానికి నిరాకరించడంతో పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి హనుమాన్ నగర్ బస్తీ ప్రజలకు మద్య వాగ్వివాదం జరిగింది. తిరిగి ఆదివారం చర్చికి చెందిన ఐదుగురిని రాజేంద్రనగర్ పోలీసులు స్టేషన్ కు తీసుకువెళ్లి రాత్రి వరకు కూర్చోబెట్టుకుని వదిలిపెట్టారు. సోమవారం ఉదయం రెవెన్యూ సిబ్బంది తో కలసి వచ్చి నూతనంగా నిర్మిస్తున్న చర్చిని నేలమట్టం చేశారు.

**ప్రభుత్వ స్థలంలో చర్చి నిర్మాణం చేయవద్దు: తహసీల్దార్ బి రాములు :**

హనుమాన్ నగర్ లో ప్రభుత్వ స్థలంలో చర్చి నిర్మిస్తున్నారని, ఆపడానికి వెళితే సిబ్బంది తో చర్చికి చెందిన వారు దురుసుగా మాట్లాడారని తహసీల్దార్ బి రాములు తెలిపారు. చెప్పినా వినకుండ చర్చి నిర్మాణం చేస్తున్నందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కూల్చివేయడం జరిగిందన్నారు.

**10 సంవత్సరాలుగా చర్చి ఉంది : చర్చి సభ్యులు**

హనుమాన్నగర్ లో స్మర్ణ ప్రార్థన మందిరం పేరుతో 10 సంవత్సరాలుగా గుడిసె లో చర్చి కొనసాగుతుందని చర్చికి చెందిన పాస్టర్ విజయ్ పాల్, సభ్యులు ఎజ్రా, మనోహార్, దశరథ, విక్టర్ పాల్, బర్నబాస్, కోర్నేలి లు తెలిపారు. గుడిసె లో ప్రార్ధనలకు ఇబ్బందిగా ఉండటంతో ఇటుకలతో చర్చి కట్టుకుంటున్నామన్నారు. రెవెన్యూ అధికారులు చర్చి అని కూడా చూడకుండ నిర్ధాక్షిణ్యంగా కూల్చివేశారని. సిలువ ను కూడా పడవేశారని వాపోయారు. తాము ఆ స్థలాన్ని ఎక్కడకు తీసుకువెళ్లడం లేదని, దేవుని ప్రార్థించడానికి మాత్రమే ఉపయోగిస్తున్నామన్నారు. ఒక వేళ ప్రభుత్వం అందరిని అక్కడి నుంచి పంపించి వేస్తే మేము కూడా వెళ్లిపోతామని, ఎంతో కష్టపడి డబ్బులు ఖర్చు చేసి కట్టుకున్న చర్చిని కూల్చివేయడం బాధాకరమన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ జోక్యం చేసుకుని తమకు చర్చి స్థలం ఇప్పించి ప్రభుత్వం చేత తిరిగి చర్చి నిర్మాణం చేసి ఇవ్వాలన్నారు.

# నేడు కాటేదాన్, శివరాంపల్లి, కిస్మత్‌పూర్, షాపూర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్/బండ్లగూడ/శంషాబాద్, ఫిబ్రవరి 9(ప్రభాత ఉదయం)**

కాటేదాన్ విద్యుత్తు సెక్షన్ పరిధిలో వేసవి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడానికి మంగళవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 16:00 గంటల వరకు దుర్గానగర్, కల్లు కాంపౌండ్, దుర్గా హిల్స్, నాగమలై వెంచర్, దుర్గామాత ఆలయ ప్రాంతం, అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంతం, శాంతినగర్, గణేష్ నగర్, పయనీర్ పాఠశాల, గణేష్ నగర్ ప్రభుత్వ పాఠశాల, విజయ్ సేల్స్, న్యూ మెఫిల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.


**శివరాంపల్లిలో...**

యూనివర్సిటీ 11 కె.వి ఫీడర్‌లో వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహణ పనుల కారణంగా ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 2.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

ప్రభావిత ప్రాంతాలు: గోల్డెన్ సిటీ, పిల్లర్ నెం 254, హసన్ నగర్.

**షాపూర్ లో...**

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం క్రింద



పేర్కొన్న విధంగా విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు

**విద్యుత్ సరఫరా నిలిపివేయబడే ప్రాంతాలు:**

కాచారం, వర్ధమాన్ కళాశాల, సుల్తాన్‌పల్లి, కవ్వగూడ, నార్కుడ, అమ్మపల్లి, చౌదర్‌గూడ,పద్మావతి ఫంక్షన్ హాల్ రోడ్

మధ్యాహ్నం మల్కారం సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు

విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.మల్కారం, కెబి దొడ్డి, నానాజీపూర్, రాయన్నగూడ, కవేలిగూడ, రామంజపూర్, రామంజపూర్ తాండ,బోటిగూడ గ్రామాలు

ఈ అసౌకర్యానికి విచారం వ్యక్తం చేయుచున్నాము. అవసరమైన నిర్వహణ పనులకు సహకరించవలసిందిగా వినియోగదారులను కోరారు.

**కిస్మత్ పూర్ లో...**

కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజు తెలిపారు.

ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 01:30 గంటల వరకు. 11 కె.విరాక్ చర్చి ఫీడర్ ప్రభావిత ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. ఈ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన సాయి కాలనీ, ప్రభుత్వ పాఠశాల, రాఘువేంద్ర కాలనీ, ఫైన్ ఆర్స్ కాలనీ, ఎన్ఆర్ఐ టౌన్‌షిప్, రాధా రియాలిటీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓం నగర్ కాలనీ, ఎస్ ఎం ఎన్‌క్లేవ్ 1 , 2, సి ఎల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చి & కృతి విల్లాస్ మొదలైనవి నిర్వహణ చెట్ల నరికివేత పనుల కోసం సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్

ఎ. మల్లేష్ రాజ్ తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.



## హెపటైటిస్-బి వ్యాధి నివారణకు విధిగా టీకా తీసుకోవాలి

### రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి09(ప్రభాత ఉదయం)**

ప్రాణాంతకమైన హెపటైటిస్ఉబివ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ టీకా తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి పిలుపునిచ్చారు.సోమవారం మైలార్ దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెపటైటిస్-బి టీకాకరణ కార్యక్రమాన్ని ఆమె అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ...కాలేయ సంబంధిత వ్యాధులకు ప్రధాన కారణమైన హెపటైటిస్-బిని టీకా ద్వారా సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు.ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు,పరిసర ప్రాంత ప్రజలకు టీకా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.డీఐఓ డాక్టర్ శిబా మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా టీకాకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రేఖ,డాక్టర్ సుబ్రమణ్యం,హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు కేశవ్,సాజ్జిద్,ఎస్‌యూవో నారాయణ,సీహెచ్ఓ కేజియా పాల్గొన్నారు.అలాగే మండల పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీలు,సూపర్వైజర్లు సురేఖ,రాజేష్, ఎస్టీఎల్ఎస్ రహీం తదితరులు పాల్గొన్నారు.






## ఘనంగా శ్రీకృష్ణ విద్యాక్షేత్ర తొలి వార్షికోత్సవం

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి09(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి శ్రీకృష్ణ విద్యాక్షేత్ర పాఠశాల తొలి వార్షికోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించింది.విద్య,సంస్కృతి,ఆధ్యాత్మికతల సమన్వయంగా ఈ కార్యక్రమం విద్యార్థులు,ఉపాధ్యాయులు,తల్లిదండ్రుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో విజయవంతంగా సాగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెక్రటేరియట్ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ అసిస్టెంట్ సెక్రటరీ బండారు నారాయణ హాజరై వేడుకలను ప్రారంభించి,విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ సమగ్ర విద్య అందించడంలో పాఠశాల చేస్తున్న కృషిని అభినందించారు.ఈ కార్యక్రమానికి ఇతర ప్రముఖఅతిథులుగా బీజేపీ నాయకులు మొంద్ర కొమరయ్య,ఎన్.మల్లారెడ్డి,సాబాద విజయ్ తదితరులు పాల్గొన్నారు.వేడుకలలో భాగంగా విద్యార్థులు విష్ణు సహస్రనామాలు,భగవద్గీత శ్లోకాలు,గోవింద నామాలను భక్తి శ్రద్ధలతో ఆలపించి అందరి ప్రశంసలు పొందారు.అలాగే కృష్ణ వైభవం పేరిట నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమంలో నరసింహస్వామి,శ్రీకృష్ణుడు, వెంకటేశ్వర స్వామి పాత్రలను అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను భక్తి భావంతో మంత్రముగ్ధులను చేశారు.ఇదేకాక యోగా ప్రదర్శనలు,సంగీత కార్యక్రమాల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను చక్కగా ప్రదర్శించారు.విద్యతో పాటు ఆధ్యాత్మిక,సాంస్కృతిక విలువలను ప్రతిబింబించిన ఈ తొలి వార్షికోత్సవం అందరి మన్ననలను పొందింది.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన చైర్‌పర్సన్ రాధమ్మ,డైరెక్టర్ రవికిరణ్ రెడ్డి,డైరెక్టర్ సుభాష్ రెడ్డి,ప్రిన్సిపాల్ నవీన్ రెడ్డి,ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు,సహకరించిన ప్రతి ఒక్కరికీ కృష్ణ విద్యాక్షేత్ర యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.


ప్రచారంలో ప్రభుత్వ విప్ బిర్ల ఐలయ్య

## జనగామ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురాలి

### ప్రజా ప్రభుత్వంలో, ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు

### ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బిర్ల ఐలయ్య

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 09(ప్రభాత ఉదయం):**

జనగామ మున్సిపల్ ఎన్నికల చివరి రోజు సోమవారం 20 వ వార్డు అభ్యర్థి గాదరి రేణుక సిద్దురాములు, 21 వార్డు అభ్యర్థి మోటే రేణుక శ్రీనివాస్, 22 వ వార్డు అభ్యర్థి కడకంచి బాలమణి శ్రీనివాస్, 23 వ వార్డు అభ్యర్థి బాల్దే మల్లయ్య, 4 వ వార్డు అభ్యర్థి మంత్రి సుమలత శ్రీశైలం, ల గెలుపు కోసం ఎన్నికల ప్రచారంలో ఆలేరు ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లక్ష్మినారాయణ నాయక్ తో కలిసి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

## కొత్తకోట, బూత్ పూర్ మున్సిపాలిటీలలో

# జోరుగా కాంగ్రెస్ పార్టీ ప్రచారం



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్



చివరి రోజు ప్రచారంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

### కాంగ్రెస్ నినాదాలతో మారుమోగిన కొత్తకోట

### చివరి రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

**కొత్తకోట, ఫిబ్రవరి 9(ప్రభాత ఉదయం)**

మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా భూత్పూర్ మున్సిపాలిటీలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ, ఎన్నికల ప్రచారంలో పాల్గొని, కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ...అభివృద్ధి,సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి, కొత్తకోట పట్టణంలో కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని కొత్తకోట ప్రజానీకానికి ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పదేళ్లు పాలించిన పాలకులు పందికొక్కుల దోచుకుతిన్నారే తప్ప కొత్తకోట మున్సిపాలిటీకి చేసింది ఏమీ లేదని, బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఐదేళ్లు మున్సిపాలిటీకి చేసింది శూన్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్తకోట మున్సిపాలిటీలో డ్రైనేజీలు, రోడ్లు తదితర సమస్యలను గుర్తించి నూతనంగా డ్రైనేజీలు, రోడ్లు నిర్మించామని అన్నారు. ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కొత్తకోట మున్సిపాలిటీ అభివృద్ధిపై చర్చించి, 20 కోట్ల నిధులు తీసుకువచ్చి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన, ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్కటిగా హామీలను నెరవేరుస్తున్నామన్నారు, అందులో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 10 లక్షల ఆరోగ్య శ్రీ, 500 లకే సిలిండర్, 2 లక్షల రుణమాఫీ, 500 బోనాస్, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కొత్తకోట మున్సిపాలిటీలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే 144 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, ఏప్రిల్ నెలలో రెండో విడత కొత్తకోట పట్టణానికి 150 ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. గత పాలకులు దోచుకు తినడం, కొత్తకోట పట్టణంలో డివైడర్ నిర్మించడం తప్ప మున్సిపాలిటీ అభివృద్ధికి చేసిందేమీ లేదని గత ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని,పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీకి అండగా ఉంటూ... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని, కొత్తకోట మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్ది, అభివృద్ధికి రోల్ మోడల్ గా కొత్తకోట పట్టణాన్ని తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.



శంషాబాద్ పాలమాకులలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### శంషాబాద్ మండలం పాల్మకూల్ గ్రామంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**శంషాబాద్,ఫిబ్రవరి09 (ప్రభాత ఉదయం)**

నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలం పాల్మకూల గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని మహిళా సంఘాలు,స్థానిక అవసరాల కోసం కేటాయించిన నిధులతో నిర్మించనున్న భవనాలకు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ. 10 లక్షల నిధులతో గ్రామ సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి కేటాయించిన రూ. 15 లక్షలతో నిర్మించనున్న పల్లె దవాఖానా భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని,మహిళా సంఘాల బలోపేతానికి ఈ వీఓ భవనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. నిర్ణీత కాలపరిమితిలోగా నాణ్యతతో ఈ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్,ఎంపీడీఓ,వార్డ్ సభ్యులు,ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో పక్కాగా ఏర్పాట్లు

### అల్లర్లు సృష్టిస్తే నాన్‌బెయిలబుల్ కేసులు: ఎస్పీ

**మెదక్,ఫిబ్రవరి9 (ప్రభాత ఉదయం)**

మెదక్ జిల్లాలోని మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీ లకు సంబంధించి ఈ నెల 11న జరగనున్న ఎన్నికల కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. గొడవలకు పాల్పడినట్లయితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో సుమారు 600 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 75 వార్డులకు 150 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయని, ఇందులో 21 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టినట్లు వివరించారు. 1,206 మంది నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీ షీటర్లను ముందస్తు బైండోవర్ చేసినట్లు చెప్పారు. జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టడంతో ఆదివారం వరకు రూ. 2,69 లక్షల నగదు, 40 కేసుల్లో సుమారు రూ. 5,23,250 విలువైన 557.44 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రూ. 3,36,000 విలువగల 336 గ్రాముల డ్రగ్స్, రూ. 9,25,250 విలువైన ఫ్రీబీస్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎంసీసీ ఉల్లంఘించిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని ప్రజలను కోరారు.

# అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి



### మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి

### శశికళా యాదవరెడ్డితో కలిసి గడ్డపోతారంలో విస్తృత ప్రచారం

**పటాన్ చెరు, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):**

మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగింపు నేపథ్యంలో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు శశికళ యాదవరెడ్డి బొల్లారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వి. చంద్రారెడ్డిలు కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం చివరి రోజున విస్తృతంగా ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి గడ్డపోతారం మున్సిపల్ కౌన్సిల్ లో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని ఓటర్లను కోరారు. వార్డులలో సమస్యల పరిష్కారానికి అన్ని విధాల నిధులు సమకూర్చి అండగా ఉంటామని ఓటర్లకు భరోసా కల్పించారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు చేసిందేమీ లేదని ప్రజాపాలన రేవంత్ సర్కార్ తోనే సాధ్యమని ప్రతి ఒక్కరు హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి సహకరించాలని ఈ సందర్భంగా ప్రచారంలో వారు ఓటర్లను విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకుల ప్రచారానికి అడుగడుగున ప్రజల నుంచి ఆదరణ లభించింది. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, స్థానికులు,,మున్సిపల్ ప్రజలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాండెడ్ లేబర్ సిస్టమ్(రద్దు) చట్టం-1976

# పేదలు అవగాహన పెంపొందించుకోవాలి








### రాష్ట్ర పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్

**రాజేంద్రనగర్(పోలీస్ అకాడమీ) ,ఫిబ్రవరి09(ప్రభాత ఉదయం)**

బాండెడ్ లేబర్ డే సందర్భంగా ఆర్‌బివిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో అకాడమీ,ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో "వెట్టిచాకిరి (బాండెడ్ లేబర్) అవగాహన పోస్టర్",సెల్ఫ్ లెర్నింగ్ డిజిటల్ బాండెడ్ లేబర్ ట్రైనింగ్ మాడ్యూల్ను ఘనంగాఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...బాండెడ్ లేబర్ సిస్టమ్(రద్దు) చట్టం-1976అమలులోకి వచ్చి 50సంవత్సరాలు పూర్తైనప్పటికీ,వెట్టిచాకిరి ఇప్పటికీ దాచిన,రూపాంతరం చెందిన రూపాల్లో కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తుందని వివరించారు. బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలనలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమైనదని,బాధితులను గుర్తించి,రక్షించి,చట్టపరంగా చర్యలు తీసుకోవడంలో శిక్షణ ఎంతో అవసరమని స్పష్టం చేశారు. పోలీస్ సిబ్బందికి ఉపయోగపడేలా రూపొందించిన ఈ సెల్ఫ్ లెర్నింగ్ డిజిటల్ ట్రైనింగ్ మాడ్యూల్ చట్టపరమైన అవగాహన,విధానపరమైన మార్గదర్శకాలు,మానవీయ దృక్పథాన్ని అందిస్తుందని ఆమె పేర్కొన్నారు. అకాడమీ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ సిబ్బంది తమకు అనుకూలమైన సమయంలో ఈ మాడ్యూల్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధులు అభిషేక్ జోషెఫ్ మట్లాడుతూ...రాజ్యాంగం కల్పించిన హక్కులు పెద ప్రజలకు అందటం లేదని బాండెడ్ లేబర్ సిస్టమ్ (రద్దు) చట్టం-1976అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తైనప్పటికీ ఈవిధానం పోలేదని ఆ కార్మికులకు వారి హక్కులు తెలిసే విధంగా ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ కృషి చేస్తుందని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాండెడ్ లేబర్ నుంచి బయటపడిన దాసరి శివమ్మ నాగర్‌కర్నూల్ నుండి రాజస్థాన్ వరకు వెట్టి చాకిరికి వెళ్లి తమ సహచరులతోని బయట పడిన విధానం గురించి,సొంత ఊరిలో ప్రభుత్వం పోలీసులు చేసిన సహాయము గురించి వివరించారు. తర్వాత తను నాయకురాలుగా ఉండి తమ చెంచు గిరిజన బిడ్డలకు ప్రభుత్వం ద్వారా తను చేస్తున్న పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధులు భాస్కర్ వేణుగోపాల్,షబిన్ జాన్,మెరక మణిలు పాల్గొని ప్రసంగించారు. వారు బాండెడ్ లేబర్ గుర్తింపు,బాధితుల రక్షణ,పునరావాస చర్యలు,శాఖల మధ్య సమన్వయం ప్రాధాన్యతపై వివరించారు. ఈ డిజిటల్ మాడ్యూల్ ద్వారా పోలీస్ అధికారుల సామర్థ్యం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బాండెడ్ లేబర్ పట్ల సున్నా సహన విధానం పాటిస్తూ,దోపిడీ లేని సమాజ నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డి. మురళీధర్,కవిత, వెంకటేశ్వర్లు, కె. ఆర్. కె. ప్రసాద్, మధుకరస్వామి,శ్రీరామమూర్తి,అసిస్టెంట్ డైరెక్టర్లు ఘంటావెంకట్రావ్,నాగేశ్వరరావు,నరహరి,రమణ,వి. శ్రీనివాసరావు,డాక్టర్లు ధనజ,రవికుమార్,వరలక్ష్మి, డీఎస్పీలు సతీష్ కుమార్,ఆదూరి శ్రీనివాసరావు,ఎన్. రామారావు,సందీప్ రెడ్డి,కె. బాస్కర్, దేవారెడ్డి,టి. అమృత్ రెడ్డి,కృష్ణ,టి. శ్రీనివాస్, ఇండోర్,అవుట్ డోర్ ఆర్ఐలు,ఇతర అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

# పరిశ్రమలలో కార్మికుల భద్రతా ఏర్పాట్లపై అధికారుల సదస్సు






**పటాన్ చెరు, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):**

ఫ్యాక్టరీలలో కార్మికుల భద్రత, ఆరోగ్య రక్షణకు సంబంధించిన ఏర్పాట్లు సరిగా అమలు చేయాలని పరిశ్రమల శాఖ అధికారులు ఆదేశించారు. బొల్లారం మైలాన్ పరిశ్రమ లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం లో ఈ భద్రత విషయం పై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం, ముఖ్యంగా వ్యక్తిగత భద్రత పరికరాలు (పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్),భద్రతా సామగ్రి అందుబాటులో లేకపోవడం, తనిఖీలలో లోపాలు ఉండటం వంటి అంశాలు చర్చనీయాంశమైంది. కార్మికుల భద్రతా ఏర్పాట్లపై జరిగిన చర్చల్లో, పరిశ్రమ లలో కార్మికులకు తగిన రక్షణ సామగ్రి అందించకపోవడం, తనిఖీ సమయంలో లోపాలు దాచిపెట్టడం వంటి అంశంపై చర్చ జరిగింది. ఇటీవల బొల్లారం ప్రాంతంలోని పారిశ్రామిక సంఘాలు, ఫ్యాక్టరీల ఇన్స్పెక్టర్లతో జరిగిన సమావేశాల్లో ఈ అంశాలు చర్చకు లేవనెత్తబడ్డాయి. తెలంగాణ ఫ్యాక్టరీల డైరెక్టర్ వై. మోహన్ బాబు రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాక్టరీలలో భద్రతా నిబంధనల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. మెదక్ ప్రాంత డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి. నెహ్రూ కూడా ఈ విషయంపై తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు.బొల్లారం ఇండస్ట్రియల్ అసోసియేషన్ తరపున అధ్యక్షుడు ఎం. ఆనంద్ రావు, వైస్ ప్రెసిడెంట్ రాయుడు దుగ్గిరాల, మైలాన్ పరిశ్రమ జనరల్ మేనేజర్ జి. సత్యనారాయణ ఈ సమస్యలపై చర్చించారు. వారు కార్మికుల భద్రత కోసం వ్యక్తిగత భద్రతా పరికరాలు, ఇతర రక్షణ సామగ్రి తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, తనిఖీల సమయంలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం, పారిశ్రామిక సంఘాలు, ఫ్యాక్టరీ యాజమాన్యాలు సమన్వయంతో పనిచేసి కార్మికులకు సురక్షితమైన పని పరిస్థితులు కల్పించాలని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.



## ఫతేనగర్ అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌ని కలిసిన కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఫతేనగర్ హిందూ స్మశాన వాటికలో సివిల్ పనులు పూర్తికావస్తునందున గార్డెనింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని, అదేవిధంగా శివాలయం అనుకుని ఉన్న కోనేరు పనులకు గతంలో కూకట్ పల్లి జోనల్ కమిషనర్ పరిధిలో ఉన్నప్పుడు నిధులు మంజూరు చేసి టెండర్ పిలవడం జరిగిందని, కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో ఆ టెండర్ రద్దు చేయడం జరిగిందన్నారు. జోనల్ కమిషనర్లు బదిలీ కావడంతో ఫతేనగర్ డివిజన్ మల్కాజ్గిరి జోనల్ కమిషనర్ కి వస్తున్నందున ఆట్టి కోనేరు పనుల కొరకు మళ్ళీ టెండర్ ని పిలవాలని కోరారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని ఎల్బీఎస్ నగర్, తెలుగుబస్తీ, నేతాజీ కాలనీ, జవహర్ నగర్ లో కొద్దికొద్ది రోడ్లు పెండింగ్ ఉన్నందుకు వాటికి కూడా నిధులు మంజూరు చేయమని కోరారు. దానికి గాను జోనల్ కమిషనర్లను సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కుక్కల రామ ముదిరాజ్, కరుణాకర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు

**మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ పార్టీవే సీఎం రేవంత్ రెడ్డి**

**సీఎం తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న నీలం మధు ముదిరాజ్**

**పటాన్ చెరు, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):**

మున్సిపల్ ఎన్నికల్లో బిఅర్ ఎస్ కు ఓట్లడిగే నైతిక హక్కు లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార సమయం ముగిసే సమయానికి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి తో పాటు మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఅర్ఎస్, బీజేపీ పార్టీలపై విమర్శల బాణాలు సంధించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి మున్సిపాలిటీల అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. సర్వేలన్ని కాంగ్రెస్ పార్టీ కి అనుకూలంగా ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలంతా కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి సిద్ధమయ్యారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సంపూర్ణ మద్దతుతో రాష్ట్రంలో మెజార్టీ మున్సిపల్ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు ఈ సమావేశంలో సీఎం సలహాదారు వెంనరేందర్ రెడ్డి పాల్గొన్నారు.



## అన్నారంలో ప్రచార హోరు

**హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించండి: కాట శ్రీనివాస్ గౌడ్**

**పటాన్ చెరు, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం):**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో, గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామంలోని 4,5,6,7,8 వార్డుల కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు నిర్మల, యాదగిరి, మమత, భానుచందర్, శ్రీదేవి గార్లకు మద్దతుగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ , మున్సిపాలిటీ కోఆర్డినేటర్ జైపాల్ ఈరోజు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తమ విలువైన ఓటును హస్తం గుర్తుపై వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కాట శ్రీనివాస్ గౌడ్ గ్రామస్థులను కోరారు.




## ఘనంగా మహా బోధి ప్రీ స్కూల్ 3వ వార్షికోత్సవ వేడుకలు

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ వెస్ట్ సాయి నగర్ లో ఉన్న మహా బోధి ప్రీ స్కూల్ మూడవ సంవత్సర వార్షికోత్సవం వివేకానంద నగర్ వివేకనంద అపార్ట్మెంట్స్ కమ్యూనిటీ హాల్లో డైరెక్టర్ గుందడి రవీందర్ కుమార్, ప్రిన్సిపల్ లావణ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి, వెస్ట్ సాయి నగర్ అధ్యక్షులు జి ప్రభాకర్, ఫౌండర్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు దశమంతరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అధ్యక్షులు జె పురేందర్ రెడ్డి మాట్లాడుతూ మహా బోధి ప్రీ స్కూలు ఫౌండర్ రవికుమార్, ప్రిన్సిపల్ లావణ్య ఆధ్వర్యంలో చిన్నారి పిల్లలకు విద్య బోధించడం, పిల్లలకు ఆటపాటలతో క్రీడలతో చిన్నారులు ఉత్సాహంగా ఉండటానికి టీచర్స్ ఎంతో జాగ్రత్తగా పిల్లలను చూసుకొని విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ప్రీ స్కూల్లో పునాది పటిష్టంగా ఉంచడానికి స్కూల్ యజమాన్యం, టీచర్స్ ఎంతో శ్రద్ధతో పిల్లలకు మంచి గుణగణాలతో ముందుకు తీసుకెళ్తూ శ్రద్ధతో చూసుకుంటున్నారని, స్కూలు యజమాన్యానికి టీచర్లకు చిన్నారులకు వారి తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అభినందనలు జె పురేందర్ రెడ్డి తెలుపుతూ దినదిన అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుచున్నానని అన్నారు. డైరెక్టర్ గుందడి రవికుమార్ మాట్లాడుతూ స్కూల్లో చిన్నారులను కంటికి రెప్పలా కాపాడుతూ మంచి పటిష్టమైన ఫౌండేషన్ తో పిల్లలకు విద్యతో పాటు ఆటపాటలతో మానసికంగా ఉత్సాహంగా ఉండటానికి ఎంతో కృషి చేస్తూ ఉన్నామని అన్నారు. స్కూల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు చిన్నారులకు వారి తల్లిదండ్రులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.



5వ వార్డులో ప్రచారం చేస్తున్న ప్రశాంత్ రెడ్డి

## 5వ వార్డులో సిపిఎం అభ్యర్థి జోగు ప్రకాష్‌ను గెలిపించండి

**కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలిస్తే వార్డు మరింత అభివృద్ధి అవుతుంది**

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 09(ప్రభాత ఉదయం):**

జనగామ మునిసిపల్ ఎన్నికల్లో భాగంగా 5వ వార్డులో కాంగ్రెస్, సిపిఐ మిత్రపక్షలు బలపర్చిన సిపిఎం అభ్యర్థి జోగు ప్రకాష్ గెలుపు కోసం మద్దతుగా సోమవారం కాంగ్రెస్ పార్టీ, సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఎం అభ్యర్థి జోగు ప్రకాష్ ని, భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలిస్తే మన వార్డు మరింత అభివృద్ధి అవుతుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి, కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ గంగం నరసింహరెడ్డి, సిపిఎం ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మల్లారెడ్డి, రాజు, చందు, రఘు, సందీప్, సక్కుబాయి, వార్డు ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



వార్డు ప్రచారంలో అభ్యర్థి సుధా

## నన్ను మీ ఇంటి ఆడబిడ్డగా ఆదరించి ఆశీర్వదించండి


**అభ్యర్థి పగిడపాటి సుధా సుగుణాకర్ రాజు...**

**నన్ను మీ ఇంటి ఆడబిడ్డగా ఆదరించి ఆశీర్వదించండి**

**ఇల్లు, ఇల్లు తిరుగుకుంటూ ముమ్మరంగా ప్రచారం**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 09(ప్రభాత ఉదయం):**

జనగామ మున్సిపాలిటీ ఎన్నికలలో 8 వ వార్డు లో బిఆర్ఎస్ విజయం కాయం మని అభ్యర్థి పగిడపాటి సుధా సుగుణాకర్ రాజు అన్నారు. సోమవారం వార్డు లోని గిర్నీగడ్డ, గీతానగర్, వికాసనగర్, కాలనీలో ఇల్లు, ఇల్లు తిరుగుకుంటూ ప్రతి ఓటర్ ను కలుస్తూ పెద్ద ఎత్తున , మహిళలు, యువకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి పగిడపాటి సుధా సుగుణాకర్ రాజు మాట్లాడుతూ ఈ వార్డు ను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ఈ వార్డు లోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మహిళా లకు, తన స్వంత నిధులతో ఉపాధి కలిపిస్తానన్నారు. నన్ను మీ ఇంటి ఆడబిడ్డ గా ఆదరించి, ఆశీర్వదించి కారు గుర్తు పై మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి మున్సిపల్ కు మరోసారి పంపాలని ప్రజలను కోరారు. జనగామ మున్సిపాలిటీ లోనే నెంబర్ వన్ వార్డుగా తీర్చిదిద్దుతానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం వార్డు ఇంచార్జ్ అగాపేట సర్పంచ్ పగిడపాటి రాజు, నరేందర్, రేఖ, నర్సిహులు, తోట్టే కృష్ణ, ఎండీ గులాం, తోట్టే నర్సింగ్, వార్డు నహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జనరల్ అబ్జర్వర్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 09(ప్రభాత ఉదయం):**

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే విధంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించి భరోసా ఇవ్వాలని, ఎన్నికల అబ్జర్వర్ నర్సింహా రెడ్డి అన్నారు. జనగామ మున్సిపాలిటీ లోని జ్యోతి నగర్ పరిధిలో గల సేయింట్ మేరీస్ హై స్కూల్, నెహ్రూ నగర్ లో మండల పరిషత్ పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ లను సోమవారం జనరల్ అబ్సర్వర్ నర్సింహా రెడ్డి పరిశీలించారు. ఎన్నికలు పకడ్బందీగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అబ్సర్వర్ సూచించారు. ఈ కార్యక్రమం లో నోడల్ అధికారి మాత్రు నాయక్, లైజనింగ్ అధికారి అన్వేష్, మున్సిపల్ వార్డ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కడకంచి బాలమణి శ్రీనివాస్ గెలుపు కోసం

# ప్రభుత్వ విప్ బిర్ల ఐలయ్య ప్రచారం




22 వ వార్డులో ప్రచారం

### జోరుగా 22వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 09 (ప్రభాత ఉదయం):**

జనగామ మున్సిపాలిటీ ఎన్నికల లో 22 వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి కడకంచి బాలమణి శ్రీనివాస్, సోమవారం ప్రభుత్వ విప్ బిర్ల ఐలయ్య, ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లక్ష్మీనారాయణ నాయక్, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ లతో కార్నర్ మీటింగ్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అభ్యర్థి కడకంచి బాలమణి శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వ అండతో జనగామ మున్సిపాలిటీ ప్రజలకు సేవ చేయడమే మా లక్ష్యంగా ఈ ఎన్నికల బరిలో ఉన్నమన్నారు. ప్రజలు దీవించి, ఆదరించి నన్ను గెలిపిస్తే వార్డులో ఉన్న సమస్యలను... నా స్వంత నిధులతో సస్యశ్యామలం చేస్తానన్నారు. రాజకీయాల్లోకి రావడం ఇదే మొదటిసారి నాకు డబ్బులు లేక కాదు, ఈ ప్రాంత బిడ్డగా ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో వచ్చాను... కాబట్టి మమ్ములను ఆదరించి జనగామ మున్సిపల్ కి పంపించినట్లయితే మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలే మా సమస్యలుగా భావించి, వాటిని మా భుజస్కందాలపై వేసుకొని పనిచేస్తామని, ఈ సందర్భంగా ఓటర్లకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు...ఉచిత బ బస్సు సౌకర్యము, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇల్లు మొదలగు పథకాలు ఇస్తున్న.. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆకర్షితులై మాపై నమ్మకం ఉంచి ఆదరించి అభిమానించి గెలిపిస్తే...24 గంటలు నా వార్డు ప్రజల కోసం సేవ చేస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో వార్డు ఇంచార్జ్ గంగారబోయిన మహేందర్, ఓబీసీ సెల్ జనగామ జిల్లా అధ్యక్షుడు ఈర్ల లక్ష్మణ్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు నిమ్మ కరుణాకర్ రెడ్డి, మినలాపురం జలందర్, బంధారం క్రాంతి, పాండవుల కమలాకర్, గవ్వల సతీష్, బాల్దే సాయికిరణ్, సంపత్, జోగు స్వామి, మధు, బాల్దే గణేష్, అభిషేక్, మల్లికార్జున్, కర్ణాకర్, రాజు, విజయ్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.




లాడ్జి లను తనిఖీ చేస్తున్న డిసిపి

## బయటి ప్రాంతాల నుంచి వచ్చిన అనుమానిత వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా

### డిసిపి రాజామహేంద్ర నాయక్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 09(ప్రభాత ఉదయం):**

జనగామ మున్సిపాల్ ఎన్నికల నిర్వహణ సందర్భంగా, జనగామ పట్టణంలో బయటి ప్రాంతాల నుంచి వచ్చిన అనుమానిత వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని. జనగామ డిసిపి రాజమహేందర్ నాయక్అన్నారు. ఈ క్రమంలో సోమవారం జనగాంమ లోని వివిధ లాడ్జీలలో బస చేసిన అనుమానితులను పరిశీలించేందుకు డిసిపి రాజమహేందర్ నాయక్, సిఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐ చెన్నకేశవులు స్వయంగా తనిఖీలు నిర్వహించారు. లాడ్జీల్లో ఉన్న అతిథుల వివరాలు, గుర్తింపు పత్రాలు, బస చేసే ఉద్దేశ్యం తదితర అంశాలను సవివరంగా తనిఖీ చేసి, ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి, అనుమానాస్పద విషయాలు గమనించిన వెంటనే సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



## బాలాజీ నగర్ కాలనీలో డ్రైనేజ్ సమస్యకు తక్షణ పరిష్కారం

### కాంగ్రెస్ నాయకులు జిట్టా సునీల్ కుమార్ యాదవ్

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, బాలాజీ నగర్ డివిజన్ లో శ్రీ సంజీవని హనుమాన్ మందిరం వద్ద గత రెండు రోజులుగా డ్రైనేజ్ పొంగిపొర్లుతూ భక్తులకు, కాలనీవాసులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగించింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జిట్టా సునీల్ కుమార్ యాదవ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునేలా సూచించారు. అధికారుల తక్షణ స్పందనతో డ్రైనేజ్ సమస్యను వెంటనే పరిష్కరించారు. కాలనీవాసులు సమస్యను త్వరితగతిన పరిష్కరించినందుకు నాయకుడికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## తాగునీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్-2 లో పటాన్ చేరు నుండి హైదర్ నగర్ వరకు, కలబ్ గూర్ నుంచి పటాన్ చేరు వరకు ఉన్న 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్ కు వివిధ ప్రాంతాల్లో భారీ లీకేజీలు పనుల నిర్వహణ నిమిత్తం సరఫరాలో అంతరాయం ఉంటుందని జలమండలి అధికారులు తెలిపారు. ఈ లీకేజీలను అరికట్టేందుకు ఈనెల 11వ తేదీన ( బుధవారం )ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు అనగా 12వ తేదీ ( గురువారం) రాత్రి 10 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. అందుకోసం ఈ 40 గంటలు కింద పేర్కొన్న కొన్ని ప్రాంతాల్లో లో ప్రెజర్ తో నీటిసరఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

**అంతరాయం ఏర్పడే ప్రాంతాలు:**

1. ఓ అండ్ ఎం డివిజన్ 17: ఆర్సీ పురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్.
2. ఓ అండ్ ఎం డివిజన్ 22: బీరంగూడ, అమీన్ పూర్, భాగ్యనగర్ కాలనీ.
3. ట్రాన్స్ మిషన్ డివిజన్ 2: ఆఫ్ టేక్ పాయింట్స్, బల్క్ కనెక్షన్లు.
4. ఓ అండ్ ఎం డివిజన్ 6: ఎర్రగడ్డ, ఎస్.ఆర్.నగర్, అమీర్ పేట్.
5. ఓ అండ్ ఎం డివిజన్ 9: కేపీహెచ్ బీ కాలనీ, కూకట్ పల్లి, భాగ్యనగర్ కాలనీ ప్రగతి నగర్ లలో మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించాలని అధికారులు సూచించారు.


## మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలి

### జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 9(ప్రభాత ఉదయం)**




మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న ఆమన్ గల్, చేవెళ్ళ, ఇబ్రహీంపట్నం, షాద్ నగర్, మొయినాబాద్, శంకర్ పల్లి మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 09వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. కాగా, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు ఈ నెల 10వ తేదీన సెలవు ఉంటుందని, పోలింగ్ రోజు అనగ ఈ నెల 11వ తేదీన ఎన్నికలు జరిగే మున్సిపాలిటీల పరిధిలో అన్ని ప్రవేటు / ప్రభుత్వ విద్యా సంస్థలు, కార్యాలయాలు, ప్రభుత్వ / ప్రైవేటు సెక్టార్ సంస్థలు , వాణిజ్య సంస్థలలో పని చేసే ఉద్యోగులకు వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా సెలవు ఉంటుందని కలెక్టర్ తెలిపారు




పోతుగంటి సుధాకర్, సునీత లను కలసి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్న బంధువులు

## ఘనంగా పోతుగంటి సుధాకర్-సునీతల 25వ వివాహ వార్షికోత్సవ వేడుకలు

**శంషాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత ఉదయం)**

శంషాబాద్ సిద్ధాంతికి చెందిన పోతుగంటి సుధాకర్ - సునీత ల 25వ వివాహ వార్షికోత్సవ వేడుకలు సోమవారం సాయంత్రం శంషాబాద్ గోల్డెన్ ఫామ్ హౌస్ లో ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యులు , బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని వధు వరులను ఆశీర్వదించారు. 25 సంవత్సరాలు తరువాత పెళ్లి చేసుకున్నట్లు ఎంతో వైభవముగా వివాహ వార్షికోత్సవం చేసుకోవడం సంతోషకరమని పలువురు గుర్తు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ అఖిల్, పాస్టర్ సుశాంక్ లు బైబిల్ సందేశాలను అందచేశారు. దేవుడు పోతుగంటి సుధాకర్, సునీత లకు మంచి ఆరోగ్యం ఇవ్వాలని ప్రార్థించారు. కార్యక్రమంలో పోతుగంటి సుధాకర్, సునీత ల కుమారులు అఖిల్, బన్నీ, కుమార్తె అంజలి లతో పాటు వివిధ పార్టీల నాయకులు, బంధువులు , మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మదిలేటి మాదిగ, డాక్టర్ ఎన్ పి రవి కుమార్, సీనియర్ జర్నలిస్ట్ అప్పారెడ్డి గూడెం భీమయ్య, మాధవి, ఎ మహేందర్, మనస్విన్, బూర్గుల రాజ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## పదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడెలా చేస్తారు

### మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా మద్దతు మాకే

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా

**ఖమ్మం,ఫిబ్రవరి9 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేనోళ్లు.. ఇప్పుడెట్ల అభివృద్ధి చేస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు, అధికారంలో ఉన్నప్పుడు దొర పోకడ తప్ప పేదోల కష్టాలు తెలుసుకోలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. పంచాయితీల్లో మద్దుత తెలిపనట్లే మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రాజమద్దతు తమకు ఉందన్నారు. చివరి రోజు ఆయన సుగిగాలి పర్యటనలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ వరి వేస్తే ఉరేనని చెప్పారని.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సన్నబియ్యం పండించే రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ డబ్బులు కూడా చెల్లిస్తున్నామన్నారు. 'ప్రస్తుతం ఉన్నది దొరల పాలన కాదు.. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమ ప్రభుత్వం' అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వకుండా కమీషన్ల కోసం రూ. లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారని విమర్శించారు. మొదట విడతగా రాష్ట్రంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని, ఏప్రిల్‌లో రెండో విడతతో పాటు మరో మూడు విడతల్లో ఇండ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. గత సర్కార్ మూతపడ్డ కోళ్లఫామ్స్, రైస్‌మిల్లుల్లో హాస్టళ్లు ఏర్పాటు చేస్తే.. తమ ప్రభుత్వం మాత్రం రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తోందన్నారు.




## 11న మున్సిపల్ పరిధిలో సెలవు

**హైదరాబాద్,ఫిబ్రవరి9 (ప్రభాత ఉదయం)**

ఈ నెల11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎన్నికలు జరిగే కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలకు ఈ నెల 11న స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ ఎన్నికల సంఘం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కోసం వినియోగిస్తున్న విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలు, ఇతర పబ్లిక్ బిల్డింగ్స్ అన్నింటికీ 10, 11 న స్థానిక సెలవు దినంగా ప్రకటించారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ఈ నెల 11 నుండి 13 వరకు సెలవులు ప్రకటిస్తూ జారీ చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608